సాక్షి ఒడిశా

సోమవారం । 11 । డిసెంబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 6,06,387
బంగారం	1 గ్రాము 300 మిల్లీ గ్రాములు
వెండి	71 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యం కల్పించాలని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. ఆదివారం జాబ్‌మేళాను ప్రారంభించారు.

- 8లో



అమ్మకాలు అదుర్స్

ధనుర్ సంక్రాంతి సందర్భంగా ముఖ్యండలకు గిరాకీ పెరిగింది. మార్కెట్‌లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

చెత్త తొలగిద్దాం.. కాలుష్యాన్ని నివారిద్దాం



ర్యాలీ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ జితేంద్రనాథ్ పట్నాయక్

పర్లాకిమిడి: స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి (స్వయంప్రతిపత్తి) కళాశాలలో యువ ఒడిశా.. నవీన్ ఒడిశా పిలుపు మేరకు క్రీడలు, ఇండోర్‌గేమ్స్, స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా ప్రిన్సిపల్ జితేంద్రనాథ్ పట్నాయక్ స్వచ్ఛతా, ప్లాస్టిక్ నిర్మూలనపై సచేతన ర్యాలీని ప్రారంభించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నిర్మూలించాలని కోరుతూ విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి చారిత్రక బి.ఎన్. ప్యాలస్ వరకూ వెళ్లారు. చెత్తాచెదారాలు తొలగించి పారిశుద్ధ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసరు ఎస్.టి.రెహ్మాన్, నోడల్ అధికారి పుళ్లక్ చంద్ర ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

అలుగు స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న అలుగు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ అటవీ రేంజ్ పరిధిలో అకుసింగి అడవుల నుంచి అలుగును అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని స్పెషల్ టాస్క్‌ఫోర్సు (టీఎస్‌కే) అధికారులు పట్టుకున్నారు. అరుదుగా కనిపించే ఈ వన్యప్రాణిని తరలించేందుకు ప్రయత్నించిన పద్మపూర్ ప్రాంతానికి చెందిన అశ్విని సాబొరా(32), గజపతి జిల్లా మురుగుడు ప్రాంతానికి చెందిన సొమసింగ్ రౌత్(31)లను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. స్వాధీనం చేసుకున్న అలుగును పద్మపూర్ అటవీ కార్యాలయంలో భద్రంగా ఉంచారు. కొద్దిరోజుల అనంతరం అడవిలో విడిచిపెడతామని అధికారులు తెలిపారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి నువాపడ గ్రామంలో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం రాత్రి జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కాసీపూర్ పీహెచ్‌సీకి తరలించారు. మృతుడు గొడల గ్రామానికి చెందిన మురళి బిసొయి (34)గా గుర్తించారు. కొద్దికాలంగా నువాపడలోని ఓ హోటల్లో మురళి పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే పనులు ముగించుకుని తాను ఉంటున్న అద్దె ఇంటికి వెళ్లాడు. శనివారం ఆత్మహత్యకు పాల్పడటంతో ఇరుగుపొరుగు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారాతో ఇద్దరు అరెస్టు



పట్టుబడిన నిందితులతో పోలీసులు

జయపురం: గొడొపొదర్ గ్రామం నుంచి జయపురానికి టైర్ ట్యూబులో 20 లీటర్ల నాటుసారా తరలిస్తున్న గౌర హరిజన్, సాబా సేన్‌నాగ్‌లను జయపురం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి ఇద్దరినీ కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ దుర్గా ప్రసాద్ పండా తెలిపారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



చైతన్యపరుస్తున్న పోలీసులు

బరంపురం: హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే ప్రమాదాలను ఆహ్వానించినట్లేనని బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ అన్నారు. ఆదివారం కళ్లికోట్ కళాశాల మెయిన్‌రోడ్డులో బరంపురం పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ విభాగం సహకారంతో జాతీయ సడక్ సురక్షా వారోత్సవాలలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్మెట్ ధరించనివారిని ఆపి పుష్పగుచ్ఛాలు అందజేసి వినూత్న రీతిలో చైతన్యపరించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ ఆటపాటలు.. అదరహో..!



శంతాలి నృత్య ప్రదర్శన

- మల్కన్‌గిరిలో ఆకట్టుకున్న జానపద కళారూపాలు
- అలరించిన బృంద ప్రదర్శనలు
- విజేతలకు బహుమతుల ప్రదానం


మల్కన్‌గిరి: ఆదివాసీ ఆటపాటలు అదరహో అనిపించాయి. మల్కన్‌గిరి జిల్లా సాంస్కృతిక భవనంలో ఆదివారం జరిగిన సాంస్కృతిక నృత్య పోటీలు అబ్బురపరిచాయి. ముందుగాజిల్లా గిరిజన అభివృద్ధి మండలి అధ్యక్షుడు అడ్మార్వా హజార్ ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద కళలను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇక్కడ జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు ఈ నెల 14 నుంచి జరగనున్న జిల్లాస్థాయి మాల్యవంత్ ఉత్సవాల్లో ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. అనంతరం 11 బృందాలకు చెందిన సుమారు మూడు వందల మంది క్రీడాకారులు ఆటపాటలతో అలరించారు. మత్తిలి సమితికు చెందిన దురువ తెగ గిరిజనుల ప్రదర్శన ప్రథమ, పాడియా సమితి చెందిన కోయ నృత్యం ద్వితీయ, మల్కన్‌గిరి సమితికి చెందిన గడంగి నృత్య ప్రదర్శన తృతీయ స్థానాల్లో నిలిచాయి. నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సోమారీ టాంగులు, సబ్ కలెక్టర్ అక్షయకుమార్ ఖేముండు, అడిషినల్ కలెక్టర్ వెబ్డార్ ప్రధాన్, డీఐపీఆర్ఓ ప్రమిళా మరిఝ తదితరులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి సమితి కళాకారులతో అధికారులు



కళాకారులతో అతిథులు



ఆదివాసీ నృత్యప్రదర్శన



దురువ నృత్యం చేస్తున్న గిరిజన తెగ

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి



వేదికపై మంత్రి సరక, భాస్కర్‌రైతా, సుబేదార్ తదితరులు



పేర్లు నమోదు చేసుకుంటున్న యువత

రాయగడ: చదువు పూర్తి చేసుకుని ఉద్యోగ వేటలో ఉన్న యువత జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక పిలుపునిచ్చారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా యంత్రాంగం, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళా మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక కేంద్రంగా భాసిల్లుతున్న రాయగడ జిల్లాలో అనేక కొత్త పరిశ్రమలు ఏర్పాటవుతుండటం ఆనందంగా ఉందన్నారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని ఉపాధి అవకాశాలు సాధించాలన్నారు. నిరుద్యోగ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి తత్వమణి మహాపాత్రో మాట్లాడుతూ జాబ్‌మేళాలో 35 పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర రైతా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కార్యనిర్వాహక అధికారి నిహార్ రంజన్, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ ప్రిన్సిపాల్ అతుల్య కుమార్ పండా, గోపాల్‌పూర్ ఆర్మీ మేజర్ సుబేదార్ మృత్యుంజయ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి కట్టారు.. ఉదయం కూలింది

- కుప్పకూలిన వంతెన
- నాసిరకపు పనులపై మండిపాటు



కూలిపోయిన వంతెన

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా నీలగిరి ప్రాంతంలో రాత్రి కట్టిన వంతెన తెల్లారేసరికి కుప్పకూలింది. నాసిరకంగా కట్టడంతో ఈ పరిస్థితి చోటుచేసుకుందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఈ వంతెన నిర్మాణం చేపట్టారు. నీలగిరి మండలం అస్తియా గ్రామ సమీపంలో కాలువ కోసం నిర్మిస్తున్న వంతెన కోసం మొత్తం 6 పిల్లర్లు నిర్మింకారు. దీనిలో 6వ స్తంభం కుప్పకూలింది. ఇది నిర్మించిన 24 గంటల వ్యవధిలోనే కూలిపోవడం గమనార్హం. ఇంజినీర్లు లేకుండానే రాత్రి సమయంలో నిర్మాణ పనులు చేపడుతున్నారని స్థానికులు, సర్పంచ్‌లు ఆరోపించారు. పిల్లర్ కూలడంతో నిర్మాణ పనుల్లో నాణ్యత తేటతెల్లమైందని మండిపడుతున్నారు. అస్తియా గ్రామ సమీపం సాలంది కాల్వ ప్రాజెక్టు కోసం వంతెన నిర్మిస్తున్నారు. అంచనాలు, ప్రణాళిక మేరకు నిర్మాణ పనులు చేపట్టడం లేదని అంటున్నారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి ప్రాజెక్టు నిర్మాణ పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కటక్ బాలి జాతరలో భారీ అవినీతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహ్మద్ మొకీం

భువనేశ్వర్: కటక్‌లో ఇటీవల ముగిసిన బాలి జాతర నిర్వహణలో భారీ స్థాయిలో ఆర్థిక అవకతవకలు జరిగాయని కటక్ బరాబటి నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ మొకీం ఆరోపించారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో కటక్ నగర పాలక సంస్థ సీఎంసీ పాత్రపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. అధికార బిజు జనతాదళ్ (బీజేడీ) కార్పొరేటర్లు కూడా జాతర నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించినట్లు పేర్కొన్నారు. కటక్ మునిసిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) సేకరించిన పన్ను డబ్బుతో 2 ప్రధాన స్వాగత తోరణాల ఏర్పాటుకు రూ.32 లక్షలు చెల్లించినట్లు టెండరు దస్తావేజుల్లో పేర్కొన్నారని, అయితే గేట్లను ఏర్పాటు చేసిన ఏజెన్సీని విచారించగా కేవలం రూ.ఆరు లక్షలు మాత్రమే చెల్లించినట్లు తేలిందని తెలిపారు. లేజర్ షో, హరిత బాణసంచా కాల్చడంలో భారీ అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. కుంభకోణానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరి అరెస్టు

జయపురం:

మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిని జయపురం పట్టణ పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. బెహరగూడకు చెందిన పూర్ణశాంత, జయనగర్‌కు చెందిన అభినాష్ మద్యం తాగి వస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేశామని చెప్పారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



క్రీడాకారులతో నిర్వాహకులు, అతిథులు



క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. బొరిగుమ్మలోని మినీ స్టేడియంలో ఆదివారం యువ ఒడిశా, నవీన ఒడిశా కార్యక్రమంలో భాగంగా క్రీడా పోటీలను ప్రారంభించారు. బొరిగుమ్మ సమితిలోని 30 పంచాయతీల నుంచి వందలాది మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మిణీ దియాన్ మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో క్రీడలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బీడీఓ విక్రమకుమార్ దొర, సమితి అధ్యక్షులు దీప్తిమయి నాయిక్, ఉపాధ్యక్షులు రాధాకాంత సామంతరాయ్, జిల్లా పరిషత్ సభ్యులు ప్రసాద్ బిడిక, పింకు శతపతి, ఎంపీ ప్రతినిధి రామచంద్ర పాఢీ, సమితి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ గంతాయిత్, రమేష్ బిశొయి, నరేంద్ర బిశొయి తదితరులు పాల్గొన్నారు.

కాపు కుటుంబాల సంక్షేమానికి కృషి



సమావేశంలో పాల్గొన్న కాపుకుటుంబం ప్రతినిధులు

జయపురం: కాపు సంప్రదాయ కుటుంబాల సంక్షేమానికి కృషి చేయాలని కొరాపుట్ జిల్లా కాపు కుటుంబం తీర్మానించింది. జయపురం సమితిలోని జాముండ గ్రామంలోని శ్రీరామ మందిరంలో ఎ.గోపాలరావు అధ్యక్షతన ఆదివారం కాపు కులస్తుల సమావేశం నిర్వహించారు. జనవరి 7న కాపు కుటుంబాల పిక్నిక్ నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో కాపు కుటుంబం కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు ఎస్.భాస్కరరావు, సాధారణ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, కోశాధికారి బి.రమేష్, కార్యవర్గ సభ్యులు దాసరి నానాజీ, రవుత్ బాసుదేవరావు, బి.బాలకృష్ణ, కె.శ్రీను, ఎస్.ప్రకాశరావు, ఎస్.విష్ణు, జి.సురేష్, పి.మహేష్, ఆర్.కార్తీక్, ఎస్.సంతోష్, బి.బలరాం, ఆర్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలనాటి అద్భుతాలు

- భువనేశ్వర్‌లో వింటేజ్ కార్ల ప్రదర్శన
- ప్రారంభించిన సీఎం నవీన్ పట్నాయక్



కార్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: అలనాటి విలాసవంతమైన కారులతో ఏర్పాటు చేసిన వింటేజ్ కార్ల ప్రదర్శనను ఆదివారం స్థానిక బారాముండా బిజూ పట్నాయక్ ప్లేగ్రౌండ్‌లో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రారంభించారు. ఒడిషా కాంకోర్స్ డి ఎలిగాన్స్ 2023' పేరుతో ఏర్పాటైన ఈ ప్రదర్శన నగరంలోని ప్రజలకు ప్రాచీన కాలం నాటి విలాసవంతమైన కారుల్ని ప్రత్యక్షంగా తిలకించే అవకాశం కల్పించింది. రాష్ట్రంలో ఇటువంటి అపురూప ప్రదర్శన ఇదే తొలిసారిగా భావిస్తున్నారు. ఇటువంటి ప్రదర్శనలు ఆటోమొబైల్ వారసత్వం కీర్తి ప్రతిష్టల్ని ప్రతిబింబిస్తాయని సీఎం పేర్కొన్నారు. ఇందుకు నిర్వాహకులు చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి ప్రశంసించారు.కోల్‌కతా, ఢిల్లీ, మహారాష్ట్ర, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు చెందిన బెంజ్, ఫోర్డ్, వోక్స్‌వ్యాగస్, రోల్స్ రాయిస్, బెంట్లీ, కాడిలాక్, బుగట్టి, జాగ్వార్ తదితర 52 కార్లు ఇక్కడ కొలువుదీరాయి. ఎక్కువ భాగం 1919, 1930 మధ్య రిజిస్టర్ అయినవే. వీటిని తిలకించేందుకు వందలాది మంది వాహనప్రియులు తరలివచ్చారు. ధర్మాదిత్య పట్నాయక్ వినియోగించిన 1886 నాటి బెంజ్ మోటర్ వాగస్, 1934 రోల్స్ రాయిస్ 20/25, 1929 బుగట్టి టీఎస్‌ఎస్ గ్రాండ్ ప్రిక్స్, 1932 ఫోర్డ్ వీ, 1920 మున్ 6–42, 1947 కాడిలాక్ కూపే, 1962 నాటి జాగ్వార్ ఎమ్‌కే2 సెలూన్ వంటి అనేక ప్రాచీన కార్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న ప్రాచీన కాలం నాటి అపురూప కార్లు



అలనాటి కార్లు



ప్రత్యేక ఆకర్షణగా ప్రాచీన కార్లు

క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న దృశ్యం

బరంపురం: జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో వందలాది కేసులు పరిష్కారమయ్యాయి. ముందుగా జిల్లా జడ్జి మలయో రంజన్ దాస్ పాల్గొని అదాలత్‌ను ప్రారంభించారు. సాయంత్రం వరకు జరిగిన కార్యక్రమంలో రోడ్డు ప్రమాద కేసులు, బ్యాంకు రుణాలు, బీమా కేసులు వంటి వాటిని పరిష్కరించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

పర్లాకిమిడి: గుసాని సమితి జంగాలపాడులో విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందాడు. ఆదివారం ఉదయం సంతోష్ సామల్ తన పొలానికి వెళుతుండగా దారిలో పొలం గట్టుపై విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే బంధువులు పర్లాకిమిడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే సంతోష్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గురండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: మండలంలోని గూడేం పంచాయతీ పరిధి సన్యాసినీలాపురం గ్రామానికి చెందిన రంగం అరుణ అనే వివాహిత ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అరుణకు వివాహమైన నాటి నుంచి భర్త ధర్మారావు పనికి వెళ్లకపోవడంతో ఇంటిలో తరచూ గొడవలు జరుగుతుండేవి. శనివారం రాత్రి కూడా గొడవ జరగడంతో టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో దంపతులకు కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. అయితే ఇంటికి వెళ్లిన తర్వాత ఆమె ఆదివారం ఉదయం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నారు. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను కిందకు దించి హుటాహుటిన టెక్కలి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఘటనపై టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ వివరాలు సేకరించారు.

అర్ధరాత్రి ఇంటిలో చోరీ

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి గోపినాథపురానికి చెందిన గుణ రమేష్ అనే వ్యక్తి ఇంటిలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు బాధితుడు ఆదివారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. గుణ రమేష్ భార్య ఊరికి వెళ్లడంతో ఆయన శనివారం రాత్రి సినిమాకు వెళ్లారు. అర్ధరాత్రి దాటాక ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూస్తే బీరువాలోని సుమారు రూ.20వేలు, రెండు తులాలు బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అధికారుల వసతి గృహ సముదాయం పనులు ప్రారంభం



భవన నిర్మాణ పనులు ప్రారంభమైన దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్‌ఎం పురం క్యాంపస్‌లో అధికారుల నివాస వసతి సముదాయం పనులు ప్రారంభించారు. రూ. 4.20 కోట్లతో ఈ నిర్మాణం చేపడుతున్నారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఈ నిర్మాణ పనులు పర్యవేక్షిస్తోంది. ప్రధాన పోర్టు పోలియో ఉన్న అధికారులు స్థానికంగా నివాసం ఉంటే విద్యార్థులకు అందుబాటులో ఉంటారు. రెడిసెన్షియల్ క్యాంపస్ కావటం వల్ల నిరంతరం అధికారుల పర్యవేక్షణ అవసరం. ఇటీవల ఈ భవన నిర్మాణాలకు రాష్ట్ర చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి శంకు స్థాపన చేశారు. ఈ పనులను క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటధన బాలాజీ పర్యవేక్షిస్తున్నారు. వీలైనంత త్వరగా భవనాలు నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెం గ్రామ సమీపంలోని తోటల్లో పేకాట శిబిరంపై ఎచ్చెర్ల ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. రూ.4020 స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేశారు.

అమ్మకాలు అదుర్స్

- ధనుర్ సంక్రాంతి సందర్భంగా ముువ్వ ఉండలకు గిరాకీ
- జోరుగా విక్రయాలు



బాపుర్ బజార్‌లో ముువ్వ ఉండల అమ్మకం



పెద్దబజార్‌లో ముువ్వ ఉండలు కొంటున్న వినియోగదారులు



ధనుర్ సంక్రాంతికి సిద్ధమైన కొబ్బరి, జీడి పలుకుల నేతి ఉండలు

బరంపురం: మరో రెండు రోజుల్లో ధనుర్ సంక్రాంతి సందర్భంగా గంజాం జిల్లాలో ముువ్వ ఉండలు (నెయ్యి ఉండలు)కు గిరాకీ పెరిగింది. గంజాం జిల్లావాసులకు ధనుర్ సంక్రాంతి ప్రత్యేకమైన రోజు కావడంతో ఉండల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొత్త బియ్యం, చెక్కె, నెయ్యి, జీడిపప్పు, కొబ్బరి ముక్కలతో వీటిని ప్రత్యేకంగా తయారు చేస్తున్నాయి. బంధువులకు, స్నేహితులకు ముువ్వుండలను అందజేసి కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేయటం గంజాం వాసుల ఆనవాయితీ. వీటిని కిలో రూ.450 నుంచి రూ.500 మధ్య విక్రయిస్తున్నారు. మరోవైపు ధనుర్ సంక్రాంతి సందర్భంగా గృహాలు, అమ్మవారి శక్తి పీఠాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్న నేపథ్యంలో స్థానిక గిరిమార్కెట్, కొమ్మపల్లి, గేట్ బజార్, చిన్న బజార్, పెద్ద బజార్‌లో పూజ సామగ్రిల అమ్మకాలు జోరుగా సాగాయి.

• అపూర్వ సమ్మేళనం



ఒకే వేదికపై 1986 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక రోటరీ సామాజిక భవనంలో 1986 బ్యాచ్ మహారాజా బాలుర ఉన్నత పాఠశాల పాత విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి సందడి చేశారు. చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం తదితర దూరప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు తరలివచ్చి డ్యాన్స్‌లు, ఆటపాటలతో అలరించారు. అప్పటి గురువులు సూరప్ప, కె.సి.పాణిగ్రాహి, పండా, రోథో మాస్టార్లను దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో రాజేంద్ర పండా, మనోజ్ పట్నాయక్, ప్రదీప్ నాయక్, చిత్రి సింహాద్రి, కులవర్ధనరావు, ప్రశాంత కుమార్ పాలో, పాట్నూరు హరి తదితరులు పాల్గొన్నారు.



సూరప్పమాస్టారును సన్మానిస్తున్న దృశ్యం

• గౌరీశంకర్‌కు సన్మానం



గౌరీశంకర్‌ను సన్మానిస్తున్న కొండబాబు, తదితరులు

రాయగడ: అమో ఒడిశా నవీన్ ఒడిశా జిల్లా కోఆర్డినేటర్‌గా నియమితులైన పట్నాన గౌరీశంకర్‌కు బీజేడీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఆదివారం రింగ్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఎల్ల కొండబాబు, జిల్లా పరిషత్ సభ్యులు ధవలేశ్వర్ నాయుడు, కాశీనాయుడు, బిరజా పాత్రో, సత్యపాడి, కొండాబత్తుల శ్రీనివాసరావు తదితరులు శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. గౌరీశంకర్ నియామకంపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

అలరించిన సాహితీ మహోత్సవం



వార్షిక సావనీర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు

రాయగడ:

సమాజంపై సరైన అవగాహన కలిగి ఉంటేనే రచయితలు ఎదుగుతారని భువనేశ్వర్‌కు చెందిన ప్రముఖ రచయిత, కేంద్ర సాహితీ అకాడమీ సభ్యుడు గౌరహర దాస్ అన్నారు. ఆదివారం రాయగడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనంలో నిర్వహించిన సాహిత్య మహోత్సవ్‌లో దాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సాహిత్యంపై అవగాహన ఏర్పరుచుకోవాలంటే పుస్తక పఠనం అవసరమన్నారు. విస్తృత అధ్యయనం, లోతైన విషయ పరిజ్ఞానం ఏర్పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డి.కె.మహంతి, రచయిత లావణ్య సబర్, సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రాదేవి , ప్రముఖ కవి, రచయిత సుశాంత్ నాయక్ తదితరులు ప్రసంగించారు. అనంతరం వార్షిక సావనీర్‌ను ఆవిష్కరించారు.

ఎంపీకి సేవా పేపర్‌మిల్లు కార్మికుల కృతజ్ఞతలు



సభలో మాట్లాడుతున్న మహంతి

జయపురం: గగణాపూర్ సేవా పేపరుమిల్లు కార్మికులు, విశ్రాంత శ్రామికుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యలను పార్లమెంట్‌లో స్పీకర్ దృష్టికి తీసుకెళ్లిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర ఉల్కకు కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం జయపురంలోని కార్మిక భవనంలో కార్మిక నేత ప్రమోద్‌కుమార్ మహంతి అధ్యక్షతన జరిగిన సేవా శ్రామికుల సమావేశంలో ఈ మేరకు ధన్యవాదాలు తెలియజేశారు. తాజా పరిణామంతో సమస్యకు పరిష్కారం కలుగుతుందనే నమ్మకం ఏర్పడిందన్నారు. సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నేత బీరెన్ మోహన పట్నాయిక్, శ్రామిక సంఘాల నేతలు జయంతి శాంత, నళినీ రథ్, ప్రితీష్ పట్నాయిక్, నారాయణదాస్ తదితరులు పాల్గొన్నారు.

వలస జీవి అదృశ్యం



కుటుంబ సభ్యులతో యర్రయ్య ఫైల్



చక్క యర్రయ్య ఫైల్

పోలాకి: మండలంలోని గుప్పెడుపేట గ్రామానికి చెందిన వలస మత్స్యకారుడు చక్క యర్రయ్య(50) కర్నాటకలోని మంగుళూరు నుంచి తిరిగి వస్తున్నట్లు సమాచారం ఇచ్చి వారం రోజులు గడుస్తున్నా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యర్రయ్యతోపాటు దాదాపు 100 మంది వరకు గ్రామం నుంచి మత్స్యకారులు వలస వెళ్లారు. ఈ నెల 2న యర్రయ్య కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి ఇంటికి వస్తున్నానని చెప్పారు. కానీ ఇప్పటివరకు ఇంటికి చేరలేదు. దీంతో ఆయన భార్య పైడమ్మ గ్రామ పెద్దలు, సంఘ నాయకుల దృష్టికి సమాచారాన్ని తీసుకెళ్లారు. మంగుళూరులో యర్రయ్య పనిచేసే చోట సైతం ఆరా తీయగా అక్కడా లేరు. యర్రయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు. నిరక్షరాస్యుడైన యర్రయ్య ఎక్కడైనా కనిపిస్తే 9347643293, 6301501093 నంబర్లకు సమాచారం ఇవ్వాలని మత్స్యకార సంఘ నాయకుడు, రాష్ట్ర నృత్య అకాడమీ డైరెక్టర్ లండ యర్రయ్య కోరారు.

రైలు కింద పడి ఆత్మహత్య

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ సమీపంలో రాణి కుమారి అనే మహిళ ఆదివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. బెంగళూరు నుంచి భువనేశ్వర్ వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా నిలబడి ఆమె బలవన్మరణానికి పాల్పడ్డారు. లోకో పైలెట్ ఎంతగా హారన్ కొట్టినా ఆమె పక్కకు తప్పుకోలేదు. స్థానికులు, లోకోపైలెట్ ఇచ్చిన సమాచారంతో జీఆర్పీ పోలీసులు వెళ్లి పరిశీలించారు. ఆమె వద్ద డిఫెన్స్ కార్డు లభించిందని, దానిపై రాణి కుమారి అనే పేరుందని జీఆర్పీ పోలీసులు తెలిపారు. ఆమె భర్త దివాకర్ కుమార్ సింగ్ హవల్దార్ సిఐ కేఎస్‌డి అని ఐడి కార్డుపై ఉందని పేర్కొన్నారు. పలాస జీఆర్పీ ఎస్‌ఐ కె.షరీఫ్ కేసు దర్యాపు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప దీక్షలు



గాంధీనగర్‌లో అయ్యప్పస్వామికి పూజలు

బరంపురం: నగరంలో అయ్యప్ప దీక్షలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పెద్ద బజార్, గాంధీ నగర్ కళ్యాణ మండప ప్రాంగణంలో వందలాది దీక్షలు నిర్వహిస్తూ భజనలు చేస్తున్నారు. అయ్యప్ప శరణుఘోషతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: ప్రభుత్వ విధానాల వల్ల కొరాపుట్ జిల్లాలో నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కడం లేదని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. జిల్లాలో ఉపాధ్యాయ, నర్సులు, ఇతర ఉద్యోగాలు జిల్లా యేతరులకే లభిస్తున్నాయని చెప్పారు. ఆదివారం దసరా పొడియ మైదానంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియుక్తి మేళా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని ఉద్యోగాల్లో 25 శాతం స్థానికులనే నియమించాలన్న నిబంధన అమలు కావడం లేదన్నారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలోని నల్కో, ఉత్కళ అల్యూమినియం, హాల్ తదితర పరిశ్రమల్లో ఎంత మంది స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలరో వెల్లడించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న నియుక్తి మేళాకు జిల్లా అధికారులు ఎందుకు రాలేదని నిలదీశారు. గత ఏడాది జరిగిన నియుక్తి మేళలో 400 మందిని వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశారని, వారిలో 100 మందికి మాత్రమే ఉద్యోగాలు లభించాయని, వారిలోనూ 50 మందికిపైగా యువత ఉద్యోగాలు వీడి ఇళ్లకు తిరిగి వచ్చారని వివరించారు. ఈ ఏడాదైనా ఎంపికైన వారందరినీ ఉద్యోగాల్లో నియమించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, గోపాలపూర్ ఇండియన్ ఆర్మీ అధికారి మేజర్ సంజీవ్‌కుమార్ దీక్షిత్, జయపురం అదనపు కలెక్టర్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి పాల్గొన్నారు.

సైబర్ మోసాలతో జాగ్రత్త



ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంక్ ఉద్యోగులు



వేదికపై అతిథులు

మల్కన్‌గిరి: ఆన్‌లైన్ లావాదేవీలు జరిపేటప్పుడు సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని వక్తలు సూచించారు. మల్కన్‌గిరిలో ఆదివారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరఫున ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ముందుగా బస్టాండ్ నుంచి వాక్‌థాన్ నిర్వహించారు. అనంతరం ఆర్థిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెద్బర్ ప్రధాన్, డిప్యూటీ కమిషనర్ శశాంక్ మొహంతి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు



బొమ్మలు వేస్తున్న విద్యార్థులు



ముఖ్యఅతిథిగా విచ్చేసిన సబ్‌కలెక్టర్ అలోక్ ప్రధాన్, హెచ్‌ఎం ధర్మారావు



నెమలి బొమ్మ

పర్లాకిమిడి: స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర బాలల సంక్షేమ మండలి, భువనేశ్వర్ సహకారంతో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్ పోటీలను ప్రారంభించగా.. డి.సి.పి.యు.అరుణ్ కుమార్‌త్రిపాఠి, ప్రధానోపాధ్యాయుడు వై.ధర్మారావు, ఉపాధ్యాయులు డి.శ్రీరామ్మూర్తి తదితరులు సహకరించారు. సీనియర్, జూనియర్, దివ్యాంగులు, సబ్ జూనియర్ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయం, సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ తదితర పాఠశాలల నుంచి 313 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

15న కుస్తీ ఎంపిక పోటీలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో ఈ నెల 15న కుస్తీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని కుస్తీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పతివాడ లక్ష్మణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27 తేదీల్లో చిత్తూరు జిల్లాలో రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహిస్తున్నామని ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 15న ఉదయం 8 గంటలకు కొండగుంపాం గ్రామానికి చేరుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 98486 20959 నంబరును సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగులను ఆర్థిక స్థితిమంతులుగా తీర్చిదిద్దాలి

- కేంద్ర విజిలెన్స్ మాజీ కమిషనర్ చౌదరి



మాట్లాడుతున్న సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ చౌదరి

కొత్తవలస : దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను సమకూర్చడంతో పాటు వారిని ఆర్థిక స్థితిమంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కేంద్ర విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి అన్నారు. మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలో గల శ్రీగురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 700 మందికి దుప్పట్లు, 50 మంది దివ్యాంగులకు వీల్‌చైర్స్, ట్రైసైకిళ్లు, కృత్రిమ అవయవాలు తదితర సామగ్రిని కేవీ చౌదరి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఆర్థికంగా ఎదిగిన రోజు మరొకరిపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని, వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. అందుకు తగ్గ సహకారం గురుదేవా చారిటబుల్ ట్రస్టు ద్వారా అందుతోందన్నారు. సాయం పొందిన వారు మరొకరికి సాయం చేసే స్థాయికి ఎదగాలని సూచించారు. ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో సేవలు అందజేస్తున్నామని తెలిపారు. సుమారు లక్షా 18 వేల మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించామన్నారు. స్టీల్ ఎక్ఛేంజి ఇండియా లిమిటెడ్ సీఎండీ బండి సురేష్‌కుమార్ మాట్లాడుతూ గురుదేవా ట్రస్టు సేవలు నిరూపమన్నారు. ట్రస్టుకు తమ కర్మాగారం నుంచి పూర్తిగా సహకరిస్తామన్నారు. ఓఎస్‌జీసీ మాజీ అధికారి అరుమగం, ప్రముఖ వైద్యుడు ఆనందకృష్ణ పాల్గొన్నారు.

జగనే మళ్లీ సీఎం కావాలని సంకల్ప యాత్ర

- ఆటోతో యాత్ర చేపట్టిన జగన్ వీరాభిమాని జయకుమార్



వైఎస్ జగన్ అభిమాని జయకుమార్ యాత్రకు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

విజయనగరం రూరల్: సంక్షేమ ప్రదాత, అభివృద్ధి కారకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రకాశం జిల్లా నాలుగుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామానికి చెందిన కావూరి జయకుమార్ ఆటోతో సంకల్ప యాత్ర చేపట్టారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి నుంచి కొద్ది రోజుల కిందట ప్రారంభమైన ఈ యాత్ర ఆదివారం విజయనగరం చేరుకుంది. 100 రోజుల ఈ యాత్ర ఈనెల 21న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో నిర్మించిన విజయస్థూపం (పైలాన్) వద్ద ముగుస్తుందని జయకుమార్ తెలిపారు. యాత్రలో భాగంగా విజయనగరం వచ్చిన ఆయన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ శ్రేణులు ఆయనకు మద్దతు తెలిపాయి.

డయల్ యువర్ డీఎం రేపు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం ఆర్టీసీ డిపో పరిధిలో గల సమస్యలపై డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఈ నెల 12న నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ కనకదుర్గ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ పరిధిలో గల సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 99592 25621 నంబరుకు కాల్ చేసి తమ సమస్యలు తెలియజేయాలని సూచించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రిని పట్టణంలో ఆయన గృహంలో మున్సిపల్ కమిషనర్ జయరాం ఆదివారం కలిశారు. మున్సిపాలిటీలో జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం, గడప గడపకు మన ప్రభుత్వం తదితర నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు, టిడ్కో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ఉప ముఖ్యమంత్రి ఆరా తీశారు.పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అతివకు అండగా..



పార్వతీపురం పట్టణంలో దిశ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమం (ఫైల్)

- పార్వతీపురం పట్టణానికి చెందిన బొత్స కామేష్ 2022 సెప్టెంబర్ నెల 15వ తేదీన పట్టణంలో బాలికపై లైంగిక దాడి చేశాడని బాలిక తల్లి పార్వతీపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితునికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 4వేలు జరిమానా విధించారు.
- సీతంపేట మండలం సోమగండి గ్రామానికి చెందిన ఏనిమిదేళ్ల బాలికపై గంటా సంతు 2018లో లైంగిక దాడి చేశాడని అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసుపై శ్రీకాకుళం ఫస్ట్ ఏడీజే, ఎఫ్ఏసీ పోక్సో కోర్టు విచారించి సంతుకు 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.
- 2022వ సంవత్సరంలో పార్వతీపురం పట్టణానికి చెందిన రొంపల్లి రామకృష్ణ పదో తరగతి చదువుతున్న తన కుమార్తె, ఆమె స్నేహితురాలిపై లైంగిక దాడి చేశాడని కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి డీఎస్పీ సుభాష్ కేసు నమోదు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో విజయనగరం పోక్సో కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.4లక్షల జరిమానా విధించింది.

- మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత
- ఆపదలో ఉన్న మహిళలకు తక్షణ సాయం
- జిల్లాలో మహిళలను వేధించిన వారిపై నమోదైన కేసులు 32
- జిల్లాలో నమోదైన పోక్సో కేసులు 24
- ఆరు నెలల్లో ఐదుగురికి యావజ్జీవ శిక్ష

పార్వతీపురం టౌన్: మహిళల భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా మన ఇంట్లో ఏం సమస్య ఉంది...? ఆడపిల్లలు కళాశాలలకు వెళ్లే దారిలో ఏమైనా ఇబ్బంది పడుతున్నారా...? ఆకతాయిల వేధింపులను పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కి చెప్పే ధైర్యం లేకుంటే...? ఈ దిగులు గుండెల్లోనే ఆగిపోవాల్సిందేనా...? అంటే కాదంటున్నారు పార్వతీపురం మన్యం జిల్లా పోలీసులు. మహిళలందరూ సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలీసు వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు.

జిల్లాలో మహిళల వేధింపులపై నమోదు చేసిన కేసులు	
పోక్సో కేసులు	24
మహిళల వేధింపులపై కేసులు	8
20 ఏళ్ల శిక్ష పడిన వారు	5
దిశ యాప్ డౌన్‌లోడ్స్	80,321
దిశకు వచ్చిన కాల్స్	3,490
దిశ కౌన్సెలింగ్‌లు	67
దిశ కేసుల నమోదు	10

ప్రతీ పోలీసుస్టేషన్‌లో మహిళా రక్షక్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ సచివాలయ పరిధిలో మహిళా పోలీసులను నియమించారు. ప్రతీ జిల్లాలో దిశ మహిళా పోలీసుస్టేషన్లను ఏర్పాటు చేసి మహిళ భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. దిశ పోలీసుస్టేషన్ల ద్వారా మహిళలపై లైంగిక వేధింపులకు గురి చేసే వారిపై కేసులు నమోదు చేసి సత్వరమే బాధితులకు న్యాయం చేకూరేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా నిందితులకు శిక్షలు పడేలా చర్యలు చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మహిళలను లైంగికంగా వేధించే వారిపై ఇప్పటి వరకు 32కేసులు నమోదు చేశారంటేనే పోలీసులు ఎంత చాకచక్యంగా ఈ కేసుల్లో వ్యవహరిస్తున్నారో తెలుస్తోంది.

ఆపదలో మహిళలకు తక్షణ సాయం

ఆపదలో చిక్కుకున్న మహిళలు సాయం కోరిన వెంటనే అక్కడకు చేరుకొని రక్షణ కల్పించే వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించింది. అదే దిశ మొబైల్ యాప్. ఈ దిశ యాప్‌పై మహిళలకు, విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ప్రతీ నెల దిశ యాప్ డౌన్‌లోడ్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటి వరకు 80,321 మంది మొబైల్స్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ఇప్పటి వరకు దిశకు 3,490 ఎస్‌ఓఎస్ కాల్స్ వచ్చాయి. 67మందికి దిశ కౌన్సెలింగ్ ఇచ్చారు. పది మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దిశకు వచ్చిన ఎస్‌ఓఎస్ కాల్స్‌పై స్పందించి తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకొని ఆపదలో ఉన్న మహిళలకు అండగా నిలుస్తున్నారు.

32 కేసులు

మహిళలను వేధించినా, లైంగిక దాడికి పాల్పడిన అటువంటి వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. తమకు అన్యాయం జరిగిందని పోలీసుస్టేషన్‌కు వెళ్లిన మహిళలకు న్యాయం చేకూరేలా చర్యలు చేపట్టారు. 2023 జనవరి నుంచి పార్వతీపురం మన్యం జిల్లాలో మహిళలపై వేధింపులు, లైంగిక దాడులకు పాల్పడిన వారిపై 32 కేసులను నమోదు చేశారు. బాధితులకు తక్షణమే న్యాయం చేకూరేలా పూర్తి చర్యలు చేపట్టారు. కోర్టుల్లో కేసులు త్వరగా ట్రైల్‌కు వచ్చేలా ఎవిడెన్స్‌లను అందజేస్తున్నారు. జిల్లాలో ఐదు కేసుల్లో సంవత్సరంలోగా ఐదుగురు ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.

గుడ్ టచ్... బ్యాడ్ టచ్‌లపై అవగాహన

6-11 ఏళ్ల మధ్య వయసున్న అమ్మాయిలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల పేరున ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఆత్మ రక్షణకు ప్రత్యేక సందర్భాల్లో ఎలా స్పందించాలో నేర్పిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే బాలికలకు చదువు, పెళ్లిలాంటి విషయాలపైన, మహిళ హక్కులపైన అవగాహన తరగతులను నిర్వహిస్తున్నారు. ఉన్నత విద్య చదువుకోవాలన్న వారికి అవగాహన కార్యక్రమాలు అందించడంతో పాటు వివిధ సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



పార్వతీపురం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పిస్తున్న దిశ డీఎస్పీ హర్షిత (ఫైల్)

కఠిన చర్యలు తప్పవు



మహిళలపై అసభ్యకరంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో బస్టాండ్‌లు, ప్రధాన కూడళ్ల వద్ద బందోబస్తును ఏర్పాటు చేశాం. మహిళా రక్షణకు ప్రతీ ఒక్కరి మొబైల్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నాం. ప్రతీ నెల దిశ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా శిక్ష తొందరగా పడేలా కోర్టులకు సంబంధిత పత్రాలను అందజేస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు ఐదు పోక్సో కేసుల్లో 20ఏళ్ల జైలుశిక్ష కోర్టు విధించింది.

– **విక్రాంత్ పాటిల్**, ఎస్పీ, పార్వతీపురం మన్యం జిల్లా

షూటింగ్‌బాల్ పోటీలో రాజాం విద్యార్థుల సత్తా



నిర్వాహకుల నుంచి బహుమతులు అందుకుంటున్న షూటింగ్ బాల్ క్రీడాకారులు

రాజాం సిటీ: రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో రాజాం నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు సత్తాచాటారు. ఈ నెల 8 నుంచి 10వరకు బాపట్ల జిల్లా మార్టూరులో అండర్-19 రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జట్టు తరఫున రాజాం నియోజకవర్గంలోని రాజాం, సంతకవిటి, వంగర, రేగిడి మండలాలకు చెందిన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాలికల జట్టు గుంటూరుతో తలపడి ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. బాలుర జట్టు నాలుగవ స్థానంలో నిలిచినట్లు షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, మండవకురిటి పీడీ మండల గోవిందనాయుడు ఆదివారం తెలిపారు. వారి ప్రతిభ పట్ల షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ పాలవలస శ్రీనివాసరావు, పలువురు పీడీలు క్రీడాకారులను అభినందించారు. విజేతలు అక్కడి ఎమ్మెల్యే రావూరి సాంబశివరావు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని పీడీ వెల్లడించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఈశ్వర్ కౌశిక్, తదితరులు

విజయనగరం రూరల్: జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో గల ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్‌తో సబ్ జూనియర్స్, క్యాడెట్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. అండర్- 17 విభాగంలో విజయనగరానికి చెందిన రొంగలి సుశ్రితనాయుడు బంగారు పతకం సాధించడమే కాకుండా ఈ నెలలోనే గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు అర్హత సాధించింది. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్, సీతం విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కోచ్ డీవీ చారి ప్రసాద్‌లు బహుమతులు ప్రదానం చేశారు.



జాతీయ పోటీలకు ఎంపికైన రొంగలి సుశ్రిత

గణిత టాలెంట్ టెస్టులో 130 మంది విద్యార్థులు



రాజాం: జిల్లా గణితపోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న గణితవేదిక ప్రతినిధులు

రాజాం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్టు నిర్వహించారు. సిక్కోలు గణిత వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ పరీక్షకు మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు అర్హత సాధించినట్లు గణితవేదిక సభ్యులు తెలిపారు. గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈపరీక్షకు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, జి.సిగడాం, పొందూరు మండలాల నుంచి 130 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష అనంతరం వారందరికీ నిర్వాహకులు జ్ఞాపికలు అందించారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల వివరాలు రెండురోజుల్లో ప్రకటిస్తామని, ఈనెల 17న జిల్లా కేంద్రాల్లో డీఈఓల చేతులమీదుగా జిల్లా విజేతలకు బహుమతులు అందజేయనున్నామన్నారు. ఈ పరీక్షలకు సెంటర్ అబ్జర్వర్‌గా కె.హేమంత్‌కుమార్, నిర్వాహకులు గణిత వేదిక ప్రతినిధులు ఎస్.హుస్సేన్, కె.కృష్ణంరాజు, శివకుమార్‌లు వ్యవహరించగా, గణిత ఉపాధ్యాయులు వై.ఆదినారాయణ, ఎల్.గోవిందరావు, జీవీ రమణ, నాగరాజు, అప్పలరాజు, బి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిత్య హృదయ హోమం



యాగశాలలో హోమం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవనం, ఆదిత్య హృదయ హోమం, తదితర కార్యక్రమాలను జరిపించారు. అనంతరం స్వామి సన్నిధిలో సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్తీక మాసం ఆదివారం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రామక్షేత్రానికి విచ్చేశారు. పలువురు ఔత్సాహిక భక్తులు బోడికొండపైకి వెళ్లి అలనాటి చారిత్రక ఆధారాలను తిలకించారు. దీంతో బోడికొండపై సందడి వాతావరణం కనిపించింది.

బొలెరో ఢీకొని వ్యక్తికి గాయాలు



ప్రమాద దృశ్యం

కొమరాడ: మండలంలోని కూనేరు రామభద్రాపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయాల పాలైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రాయగడ నుంచి వస్తున్న బొలెరో వాహనం పార్వతీపురం నుంచి బైక్‌పై ఎదురుగా వస్తున్న చందక సింహాచలాన్ని ఢీకొట్టింది. దీంతో సింహాచలం కుడికాలు విరిగిపోయింది. ఈ విషయం గమనించిన స్థానికులు పార్వతీపురంలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కొమరాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యాటకులతో సందడిగా పార్క్



పర్యాటక కేంద్రంలో చిన్నారుల సందడి

గరుగుబిల్లి: తోటపల్లి కుడిమట్టికట్ట ప్రాంతంలో ఏర్పాటు చేసిన పర్యాటక కేంద్రాన్ని వీక్షించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పార్క్ ఆదివారం సందడిగా మారింది. పార్వతీపురం ఐటీడీఏ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న పర్యాటక కేంద్రంలో ఏర్పాటుచేసిన అపురూప చిత్రాలు, ఈప్రాంత సామాజిక స్థితిగతులను తెలియజేస్తున్నాయి. విగ్రహాలు పలువురిని ఆకర్షిస్తున్నాయి. చిన్నారులు ఆడుకునేందుకు జంప్‌బాల్, ఊయల, జారుడుబల్ల ఏర్పాటుచేశారు. ఈ ప్రాంతంలో పర్యాటక కేంద్రం, తోటపల్లి భారీ నీటిపారుదల ప్రాజెక్టు, చినతిరుపతిగా పేరుగాంచిన వెంకటేశ్వరస్వామి ఆలయం ఉండడంతో ఈ ప్రాంతమంతా సందడిగా కనిపిస్తుంది. పర్యాటకులు అధికంగా సందర్శనకు రావడంతో చిరువ్యాపారులు సైతం తమ వ్యాపారాలు మెరుగ్గా ఉండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇదేం చీడ బాబోయ్..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు రామభద్రపురం గ్రామానికి చెందిన చింతల అప్పలనాయుడు. సుమారు రెండు ఎకరాలలో పొట్టి చిక్కుడు పంట సాగు చేస్తూ దాదాపు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాడు.అయితే పంట చేతికందే సమయంలో మిచాంగ్ తుఫాన్ కారణంగా తెగులు సోకి చూస్తుండగానే పంట పాడవడంతో పెట్టుబడి పోయే పరిస్థితి నెలకొందని వాపోతున్నాడు. అధికంగా పెట్టుబడులు పెట్టడంతో పాటు కుటుంబమంతా ఆరుగాలం కష్టపడినా ప్రకృతి సహకరించడంలేదని నేల రాలిన చిక్కుడు పిందెలు చూపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



తెగులు సోకిన చిక్కుడు పంటను దిగాలుగా చూపుతున్న రైతు

- కూరగాయ పంటలకు తెగులు, పురుగు బెడద
- వాపోతున్న రైతులు



తుఫాన్ ప్రభావంతో పూర్తిగా పాడైన చిక్కుడు పంట

రామభద్రపురం: ఆరుగాలం కష్టపడినా అన్నదాతకు కాలం కలిసి రావడంలేదు. కూరగాయల రైతులకు ప్రకృతి సహకరించడంలేదు.ఖరీఫ్ సీజన్ మొదట్లో విత్తిన విత్తనం మొలకెత్తకుండా వరుణుడు ముఖం చాటేయడం, తర్వాత అధిక వర్షాలు కురవడంతో నానా అవస్థలు పడుతూ సాగునీరందించి మొక్కను బతికించుకున్నారు. పంట చేతికందే సమయంలో రెండు నెలలుగా తీవ్ర వర్షాభావం నెలకొంది. దీంతో బోరుబావులు, నేలబావులలోని నీటిని కిరోసిన్ ఇంజిన్లతో తోడి అందించారు. రైతులు అప్పులు చేసి మదుపులు పెట్టి ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేస్తే మళ్లీ పూత వచ్చి పిందె కడుతుందన్న సమయంలో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో వరుసగా మూడు రోజుల పాటు జోరుగా వర్షాలు కురిశాయి. దీంతో పంటలకు చీడపీడలు, వైరస్ సోకడంతో కూరగాయ పంటలు బాగా దెబ్బతిని కోతకు వచ్చిన పంటంతా పోయింది. జిల్లాలోని ఖరీఫ్,రబీ సీజన్లలో దాదాపుగా 3 వేల హెక్టార్లలో కూరగాయల పంట సాగవుతోంది. రామభద్రపురం మండలంలో 400 నుంచి 500 హెక్టార్లలో సుమారు 2000 మంది రైతులు బీర, చిక్కుడు, వంగ, టమాటో, బెండ, కాకర, క్యాబేజీ వంటి కూరగాయ పంటలు సాగుచేస్తున్నారు. అధికంగా కురిసిన వర్షాల కారణంగా కూరగాయ పంటలకు వివిధ రకాల తెగుళ్లు సోకుతుండడంతో కూరగాయల్ని పండించే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రకృతి విపత్తులకు తెగుళ్లు సోకడంతో పెట్టుబడులు సైతం కోల్పోయే పరిస్థితి నెలకొంది. అందులో భాగంగా సుమారు 500 మంది రైతులు ఆరుగాలం శ్రమించి పొట్టి చిక్కుడు 50 హెక్టార్లలో సాగుచేస్తున్నారు. ఈపంట పూత,పిందె దశలకు చేరుకున్న సమయంలో కాండం తొలుచ పురుగు, వేరుకుళ్లతెగులు, వివిధ రకాల చీడపీడలు ఆశించి నాశనం చేస్తోంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడి విలవిలలాడుతున్నారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మొక్కలు ఎదుగుదల లేక, చనిపోతున్నాయి. అలాగే వేరుకుళ్లు తెగులు సోకిన మొక్కల ఆకులు వాడిపోతూ, పూత పిందె రాలిపోతూ ఉంటుందని రైతులు చెబుతున్నారు. పంట చేతికొచ్చే లోపే పాడవుతుందని వాపోతున్నారు. కొద్ది రోజుల్లో కోతకు వస్తుందనుకుంటున్న తరుణంలో పంట తెగులు, పురుగు బారిన పడడంతో ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టపోయాం..



పది సంవత్సరాలుగా కూరగాయల పంటలు సాగు చేస్తున్నాను.అందులో ఎక్కువగా పొట్టి చిక్కుడు సాగు చేస్తాను. వాతావరణ పరిస్థితుల కారణంగా కూరగాయల పంటకు ఇంతగా తెగులు సోకడం ఇదే మొదటసారిగా చూస్తున్నాను. క్రిమి సంహారక మందులు పిచికారీ చేసినా తెగులు, పురుగులు వదల లేదు. ఎకరా విస్తీర్ణంలో చిక్కుడు సాగుకు అప్పు చేసి రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. పంట చేతికొచ్చే సమయంలో మిచాంగ్ తుఫాన్ కారణంగా అధిక వర్షాలు కురిసి తెగులు బెడద ఎక్కువై పంట పాడవడంతో అప్పుల పాలవుతున్నాను.

గెద్ద జగన్నాథం, రైతు,రామభద్రపురం